క్లుప్తంగా

దుర్గాడ శివాలయంలో ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో స్వామివారు

గొల్లప్రోలు: మాస శివరాత్రిని పురస్కరించుకుని బుధవారం దుర్గాడ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు ఉదయం స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వర్షంతో స్తంభించిన జనజీవనం


కొత్తపల్లిలో కురుస్తున్న వర్షం

కొత్తపల్లి: మండలంలోని బుధవారం కురిసిన వర్షానికి జన జీవనం స్తంభించింది. భారీ వాన కురవడంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్‌లో ఇరు వైపులా ఉన్న డ్రైన్లు ఆక్రమణకు గురికావడంతో, మోకాల్లోతు నీరు నిలిచిపోయింది. ఉప్పాడ–పిఠాపురం రోడ్డులో పలుచోట్ల నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

సొసైటీ అధ్యక్షుడి రాజీనామా


జ్యోతుల భీముడు

గొల్లప్రోలు: విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షుడు జ్యోతుల భీముడు రాజీనామా చేశారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమికి తనతో పాటు సభ్యులు రామిశెట్టి సత్తిబాబు, ఎనెటి బాబురావు నైతిక బాధ్యతగా భావించి రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు. తమ రాజీనామా పత్రాన్ని జిల్లా కోఆపరేటివ్ సొసైటీ కాకినాడ (డీఆర్సీ)కి పంపినట్టు తెలిపారు.

సహకరించిన వారందరికీ ధన్యవాదాలు

– వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత



పిఠాపురం: సార్వత్రిక ఎన్నికల్లో సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్టు వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత తెలిపారు. ఆమె బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పిఠాపురం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేసిన సందర్భంగా పిఠాపురం ప్రజలందరూ పూర్తి సహకారం అందించారన్నారు. తన వెన్నంటి నిలిచిన వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు, స్థానిక సంస్థల ప్రతినిధులకు, సంస్థాగత కమిటీల నాయకులకు, పెద్దలకు, మహిళలకు, యువకులకు, ముఖ్యంగా వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసిన ఓటర్లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో పిఠాపురం ప్రజలు అందించిన సహకారం జీవితంలో మరువలేనని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారికి పూర్తి సహకారం అందిస్తానని ఆమె చెప్పారు.

యథేచ్ఛగా వృక్ష సంపద నరికివేత


ఉప్పాడ–పిఠాపురం రోడ్డులో ఉప్పాడ వద్ద నరికివేతకు గురైన వృక్షాలు

కొత్తపల్లి: అటవీ, విద్యుత్ అధికారుల సమన్వయం లోపం కారణంగా విలువైన వృక్ష సంపద నేలకొరుగుతోంది. కష్టపడి పెంచిన మొక్కలకు అటవీ శాఖ అధికారుల సంరక్షణ లేకపోవడం ఒక తీరైతే, సాంకేతిక ఇబ్బందులంటూ పచ్చని చెట్లను తొలగించడమే పనిగా పెట్టుకున్న విద్యుత్ అధికారులది మరో తీరు. మండలంలో ఉప్పాడ–పిఠాపురం రోడ్డులో మొక్కలు ఏపుగా పెరిగి రహదారికి ఇరువైపులా సుందరంగా, ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయన్న నెపంతో సంబంధిత అధికారులు చెట్ల కొమ్మలను యథేచ్ఛగా నరికివేస్తున్నారు. మొక్కలు నాటినప్పుడు నోరు మెదపని విద్యుత్ అధికారులు నేడు విద్యుత్ లైన్ల కోసం చెట్లను తెగనరుకుతున్నారు. పాలకులు వ్యయప్రయాసలతో ఏటా లక్షలాది మొక్కలు నాటుతుంటే, ఆ లక్ష్యాన్ని విస్మరించి ఇష్టం వచ్చినట్టు నరకడం బాధాకరమని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాజప్పకు అభినందనలు

సామర్లకోట: నియోజకవర్గం నుంచి నిమ్మకాయల చినరాజప్ప హ్యాట్రిక్ సాధిస్తూ ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు, అభిమానులు బుధవారం అభినందనలు తెలిపారు. అచ్చంపేట ఆయన స్వగృహానికి తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

మేలైన పంటకు మట్టి పరీక్ష

- భూసార పరీక్షలతో సాగుకు ప్రయోజనాలు
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
- రసాయన ఎరువుల వినియోగానికి దూరం


పెద్దాపురంలో మట్టి నమూనా సేకరిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

పెద్దాపురం: పూర్వం వేసవిలో భూమిని దుక్కి చేసేవారు. పెంటగెత్తం, చెరువు మట్టిని వేసి సారవంతం చేసేవారు. వర్షాలు అనుకూలించిన వెంటనే సాగుకు సిద్ధమయ్యేవారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చేవి. ఆరోగ్యకరమైన పంటలు చేతికి అందేవి. కాలం మారింది. రసాయన ఎరువుల వినియోగం పెరిగింది. భూమి నిస్సారమై, పంటలు కలిసి రావడం లేదు. ఏ పంట సాగు చేసినా పెట్టుబడే మిగులుతోంది. ఈ నేపథ్యంలో భూసార పరీక్షలకు ప్రాధాన్యం పెరిగింది. మట్టి పరీక్షలు నిర్వహించి పోషక లోపాలు నివారించాలని, పశువుల పెంట, పచ్చిరొట్ట ఎరువులతో భూమిని సారవంతం చేయాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. మట్టి పరీక్షల ప్రాధాన్యం వివరిస్తున్నారు. భూసార పరీక్షల నివేదిక ఆధారంగా పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని సామర్లకోట మండలంలో 22,250 ఎకరాలు, పెద్దాపురం మండలంలో 9,892 ఎకరాలు, వెరసి 32,142 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఎరువులు ఎక్కువ మోతాదులో పొలాల్లో వినియోగించడంతో భూమిలో పోషక విలువలు తగ్గి, భూమి నిస్సారంగా మారింది. కాంప్లెక్స్ ఎరువుల వినియోగంతో భూమిలో సూక్ష్మ, స్థూల పోషకాల్లో వ్యత్యాసాలు ఏర్పడి, దిగుబడులు తగ్గడంతో పాటు చీడపీడలు అధికమతున్నాయి. నియోజకవర్గంలో ఎక్కువ శాతం జింకు లోపంతో ఉన్న నేలలే అధికంగా ఉన్నట్టు వ్యవసాయ గణాంకాలు చెబుతున్నాయి.

భూసార పరీక్షలు ఇలా..

సాధారణ పొలంలో అయితే ఆరు అంగుళాల లోతు, చెరకు, అరటి లాంటి పొలాల్లో అయితే ఎనిమిది అంగుళాల లోతులో వి ఆకారంలో పారతో కట్ చేసి, మట్టి నమూనా సేకరించాలి. ఇలా ప్రతి ఐదెకరాలకు ఒక మట్టి నమూనాను సేకరిస్తారు. మట్టి నమూనాతో పాటు, రైతు పేరు, సర్వే నంబరు, విస్తీర్ణం, ముందు వేసిన పంట, వేయబోయే పంట, వినియోగించిన ఎరువుల వివరాలను పొందుపరుస్తారు. వీటిని ఇంటిగ్రేటెడ్ ల్యాబ్(భూసార పరీక్షా కేంద్రం)కు తరలించి, పరీక్షలు నిర్వహిస్తారు. భూసార పరీక్ష అనంతరం సేంద్రియ కర్బనం, ఎలక్ట్రికల్ కండక్టవిటీ (ఈసీ), ఉదజని సూచిక (పీహెచ్), నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మ మూలకాలు తదితర ధాతు లోపాలు కార్డుపై నమోదు చేసి రైతుకి అందిస్తారు. దీంతో లోపాలు సవరించేందుకు కార్డులో ఇచ్చిన ధాతువులు పొలంలో వేసుకుంటే భూమిలో సిరులు పండుతాయి. ఈ పరీక్షలు ఖరీఫ్ సాగు ప్రారంభం నాటికి పూర్తి చేస్తామని వ్యవసాయ శాఖ సిబ్బంది చెబుతున్నారు.

భూసార పరీక్షల వల్ల లాభాలు..

- ఎరువుల వినియోగం తగ్గడం ద్వారా ఖర్చు తగ్గించుకోవచ్చు.
- భూమిలో ఎటువంటి లోపాలున్నాయో తెలుస్తాయి.
- తెగుళ్లు, పురుగులను నివారించవచ్చు.
- వ్యవసాయ పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి.

పచ్చిరొట్ట విత్తనాలు చల్లాలి



పూర్వం రైతులు ఎరువులకు బదులు పెంటగెత్తాలు, పచ్చిరొట్ట ఎరువులైన పిల్ల పెసర, కట్టే జనుము తదితరాలు వినియోగించేవారు. భూసారం పెరిగి మంచి పంటలు పండేవి. ప్రజలు ఆరోగ్యంగా జీవించేవారు. నేడు రసాయనిక ఎరువుల వాడకంతో ఖర్చు పెరిగి, వ్యవసాయం భారంగా మారింది. ఈ పరిస్థితి అధిగమించేందుకు పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, పిల్లి పెసర 75 శాతం రాయితీపై వ్యవసాయ శాఖ అందజేస్తోంది. రైతులు వినియోగించుకుని భూసారం పెంచుకోవాలి.

– కె.సంజయ్‌కుమార్, ఏఓ, పెద్దాపురం మండలం

ఘనంగా నేరేళ్లమ్మ తల్లి జాతర


ఉత్సాహంగా నిర్వహిస్తున్న గరగ నృత్యాలు

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరి గ్రామ దేవత నేరేళ్లమ్మ తల్లి జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో చిరుతాడిని గరగ నృత్యాలతో ఊరేగించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. గత 15 రోజులుగా గ్రామంలో ప్రతి రోజూ గరగ నృత్యాలు నిర్వహిస్తున్నారు. గురువారం అమ్మవారి తీర్థాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.


గ్రామంలో చిరుతాడిని ఊరేగిస్తున్న భక్తులు

వైభవంగా నీలమ్మ జాతర

భక్తిశ్రద్ధలతో గరగ నృత్యాలు


సామర్లకోటలో వేంచేసి ఉన్న నీలమ్మ అమ్మవారి ఆలయం వద్ద గరగల నృత్యం

సామర్లకోట: స్థానిక నీలమ్మ చెరువు వద్ద ఉన్న నీలమ్మ తల్లి ఆలయంలో బుధవారం రాత్రి గరగల నృత్యంతో జాతర ఉత్సవాలు నిర్వహించారు. పట్టణ ప్రజలకు తాగునీటి కోసం సుమారు 130 ఏళ్ల క్రితం పట్టణ ముఖ్య కూడలిలో చెరువు తవ్వకం చేస్తున్న సమయంలో చిన్న రాతి విగ్రహం బయట పడింది. దాంతో ఆ అమ్మవారిని నీలమ్మగా గుర్తించడంతో పాటు చెరువుకు నీలమ్మ చెరువుగా నామకరణం చేశారు. ఆ రాతి విగ్రహానికి చిన్న గుడి కట్టించి ప్రతి రోజు ధూపదీప నైవేద్యాలు పెడుతున్నారు. ఈ మేరకు ఏటా జూన్ మాసంలో ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా మారిందని నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి జాతరలో భాగంగా గురువారం సిరి బొమ్మ ఊరేగింపు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. కొంత మంది యువకులు కమిటీగా ఏర్పడి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీపాలంకరణ చేశారు.

స్థూపాన్ని కూల్చిన వారిని అరెస్టు చేయాలి

తాళ్లరేవు: అమలాపురం శివారు చింతపల్లివారిపేటలో జైభీమ్ స్థూపాన్ని మోటార్ సైకిల్‌తో ఢీకొట్టిన వ్యక్తులపై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని విశ్వజన కళా మండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇద్దరు జనసేన కార్యకర్తలు మద్యం మత్తులో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని, వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఈఓ పీఆర్డీ రాజశేఖర్


ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఈఓ పీఆర్డీ రాజశేఖర్

పెద్దాపురం: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ అన్నారు. పర్యావరణ దినోత్సవంలో భాగంగా బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సీనియర్ సహాయకులు జగన్నాథం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ మొక్కల ద్వారా వచ్చే స్వచ్ఛమైన గాలి కరువవుతుందన్నారు. ప్రపంచంలో పర్యావరణాన్ని కాపాడేందుకు నేటి యువత, ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నక్కా సత్యనారాయణమూర్తి, జూనియర్ సహాయకులు మహేష్, సిబ్బంది సుధాకర్, రోజా, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు

స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం విద్యార్థులకు పర్యావరణ చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ కన్వీనర్ కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రపంచంలో పర్యావరణాన్ని కాపాడేందుకు నేటి విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉపాధికి అవసరమైన పరిశ్రమలు అవసరమే కానీ పర్యావరణాన్ని నాశనం చేసి వాటిని నిర్మించకూడదన్నారు. అనంతరం పర్యావరణానికి సంబంధించి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి.క్రాంతికుమార్, నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, రొంగల అరుణ్, బుద్ధా శ్రీనివాస్, దుంగల పూజిత, శ్యామ్‌కుమార్, ఉమా మహేశ్వరి, నమ్రత, ఆర్.రవి, కె.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెట్లు నరికేస్తే భూతాపం తప్పదు


సామర్లకోట బచ్చు ఫౌండేషన్ హైస్కూల్‌లో మొక్కలు నాటిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

సామర్లకోట: ప్రస్తుతం ప్రతి ఒక్కరూ కాలుష్య కోరల్లో చిక్కుకోవడంతో పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం వి రాజు అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా బుధవారం పాఠశాలలో మొక్కలు నాటు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల విస్తీర్ణం పేరుతో కొన్ని వందల సంవత్సరాల నాటి చెట్లను తొలగించడంతో భూమిపై వేడి పెరిగిపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ తమ తమ ఇళ్ల వద్ద రెండు మొక్కలు వేసిన వాటిని పరిరక్షించుకోవాలన్నారు. సైన్స్ టీచర్ ఎస్ఎల్‌వీ కుమారి మాట్లాడుతూ పర్యావరణానికి కలిగిస్తున్న అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. నీరు, గాలి కలుషితం కావడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ప్లాస్టిక్ నిషేధం పూర్తిగా అమలు జరగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.బ్రహ్మానందం, భద్రమ్మ, ఎ.శ్రీవల్లి, శేషారత్నం, ఫిజికల్ డైరెక్టర్ తాళ్లూరి వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు కృషి చేయాలి

ఎంఈఓ శివరామకృష్ణయ్య


వేట్లపాలెం జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల పర్యావరణ పరిరక్షణ ర్యాలీ

సామర్లకోట: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తీసుకోవాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా వేట్లపాలెం జిల్లా పరిషత్తు హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాట్టారు. బాలికలు, ఉపాధ్యాయులచే పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని తెలియజేసే ప్లకార్డులతో గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. పర్యావరణానికి హాని కలిగిస్తున్న ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అనురాధ, ఉపాధ్యాయులు పీవీ సత్యనారాయణ, ఎస్‌వీవీఎస్ఎస్ కుమారి, బి వెంకటలక్ష్మి, కేవీ రామలక్ష్మి, కేవీ రామలక్ష్మి, ఎం.బాబూరావు, పి.రఘునీ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో పర్యావరణ పరిరక్షణపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రైల్వే డాక్టర్ చెన్నకేశవరెడ్డి, స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీధర్, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణ్, ఐఓడబ్ల్యూ రవికాంత్, రైల్వే ఆస్పత్రి సిబ్బంది, స్టేషన్ సిబ్బంది, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ, మలేరియాపై అప్రమత్తత అవసరం


తాటిపర్తి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

గొల్లప్రోలు: మలేరియా, డెంగీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని చేబ్రోలు పీహెచ్‌సీ డాక్టర్ తులసి అన్నారు. బుధవారం మండలంలోని చెందుర్తి గ్రామంలో హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా, డెంగీ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఏఎన్ఎం, ఆశా వర్కర్లకు సూచించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటి వద్ద మంచాన ఉన్న రోగుల వద్దకు వెళ్లి, వైద్య సేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలందించి, పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు.

తాటిపర్తి గ్రామంలో గొల్లప్రోలు పీహెచ్‌సీ వీహెచ్ఎస్ అహ్మద్ బాషా బుధవారం తాటిపర్తి–1, హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ వ్యాధులపై అప్రమత్తత చాలా అవసరమని చెప్పారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం శుభ్రత దినం పాటించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మదుగులమ్మ జాతర


మదుగులమ్మ అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

సామర్లకోట: మండల పరిధిలో హుస్సేన్‌పురం గ్రామంలోని మదుగులమ్మ ఆలయంలో జాతర ఉత్సవం బుధవారం భక్తి శ్రద్ధలతో జరిగింది. గ్రామ ముఖద్వారంలో వేంచేసి యున్న మదుగులమ్మ తల్లిని గ్రామ దేవతగా కొలుస్తారు. ఏటా వైశాఖ మాసంలో చతుర్దశి, కృత్తిక నక్షత్రంలో అమ్మవారి జాతర ఉత్సవం నిర్వహిస్తుంటారు. ఈ మేరకు ఉదయం నుంచి అమ్మవారిని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు దర్శించుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, బ్యాండ్ మేళాలతో జాతర ఉత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ నాయకులు చల్లా బుజ్జి, కోట అప్పారావు, పి.నాయుడు, శ్రీను, అప్పారావు, మార్ని సూర్యారావు ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించి భక్తులకు సేవలందించారు. నిమ్మకాయల రంగనాగ్ అమ్మవారిని దర్శించుకున్నారు.

దళిత వేదన పుస్తకావిష్కరణ


దళిత వేదన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

యానాం: నిబద్ధ ఉపాధ్యాయునిగా సేవలు అందించడమే కాకుండా, ఆనాడు దళితులు ఎదుర్కొన్న ఘటనలను పద్య, గద్య, గేయాలుగా కొల్లి వెంకన్న మాష్టారు రచించిన పుస్తకం వేదనా తరంగమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సర్కిల్ ది యానాంలో దళిత వేదన పుస్తకావిష్కరణ కార్యక్రమం ప్రముఖ కవి కథకుడు, దాట్ల దేవదానంరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత వేదన పుస్తకంలోని పలు అంశాలను విశ్లేషించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పానుగుమట్ల విష్ణుమూర్తి మాట్లాడుతూ తొలిదశలో దళిత ఉద్యమంలో వెంకన్న మాష్టారి పోరాటం తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్ఎఓ నామాడి అప్పారావు, విశ్రాంత ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కొల్లి సత్యనారాయణ, పిల్లి రాంబాబు, గుత్తాల శ్రీరాములు, భూషణం, కుంచే సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై దృష్టి పెట్టాలి

- ఎన్‌సీసీ విద్యార్థులకు డీఎఫ్ఓ భరణి పిలుపు


నవోదయలో మొక్కలు నాటుతున్న డీఎఫ్ఓ, ఎన్‌సీసీ అధికారులు

పెద్దాపురం: ఎన్‌సీసీ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించి మొక్కలు నాటడాన్ని బాధ్యతగా తీసుకోవాలని కాకినాడ డీఎఫ్ఓ భరణి అన్నారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో బుధవారం పర్యావరణ దినోత్సవంలో భాగంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా భరణి మాట్లాడుతూ ప్రపంచంలో పర్యావరణాన్ని కాపాడేందుకు నేటి యువత, ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణం జలమయం

- గంట పాటు కురిసిన వర్షం
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట: రాష్ట్రంలో ప్రవేశించిన రుతుపవనాలతో బుధవారం మధ్యాహ్నం భోరున వర్షం కురిసింది. ఈదురు గాలులతో వర్షం ప్రారంభం కావడంతో విద్యుత్ శాఖ అధికారులు సరఫరా నిలిపివేశారు. సుమారు గంటన్నర పాటు వర్షం కురియడంతో స్టేషన్ సెంటర్, బస్సు కాంప్లెక్స్, పెద్దాపురం రోడ్డు, జయలక్ష్మి థియేటర్ రోడ్డు, సత్యనారాయణపురం, బస్సు కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, వెలమపేట, సంపెంగతోట, భాస్కర్‌నగర్, క్వారీ గోతులు నీటితో నిండిపోయాయి. ఈదురు గాలులకు పెద్దాపురం 11 కేవీ విద్యుత్ వైర్లపై చెట్టు కొమ్మలు పడడంతో మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 7.30 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేశారు.


సామర్లకోట పోలీసు రింగ్ సెంటర్‌లో వర్షపు నీరు

చెరువును తలపిస్తున్న సామర్లకోట వెలమపేట రోడ్డు

గురుకుల పాఠశాలల్లో దరఖాస్తులకు ఆహ్వానం

అమలాపురం రూరల్: అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం రూరల్ మండలం సమనస గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర, రామచంద్రపురం బాలికల గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఉన్న ఖాళీలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వైటీఎస్ రాజు తెలిపారు. ఆరో తరగతిలో మత్స్యకారులు 9, బీసీ–4, బీసీసీ –1, బీసీడీ–4, బీసీ ఈ–3, ఇతరులు 2, ఏడో తరగతిలో మత్స్యకారులు–6, బీసీఏ–1, బీసీబీ–3, బీసీడీ–2, బీసీ ఈ–2, ఎనిమిదో తరగతిలో మత్స్యకారులు–1, బీసీడీ–1, ఎస్సీ–1, తొమ్మిదో తరగతిలో మత్స్యకారులు–20, బీసీఏ–1, బీసీబీ–1, బీసీఈ–1, ఎస్సీ–2, ఎస్టీ–1 ఖాళీలున్నాయని వివరించారు. అదేవిధంగా రామచంద్రపురం బాలికల గురుకుల పాఠశాలలో ఆరో తరగతిలో బీసీఏ–5, బీసీబీ–6, బీసీసీ–1, బీసీఈ–1, ఎస్సీ–5, ఎస్టీ–2, ఖాళీలు ఉండగా, ఏడో తరగతిలో బీసీబీ–1, ఎస్సీ–2, ఎనిమిదో తరగతిలో బీసీబీ–1, బీసీఈ–1, బీసీసీ–1, ఎస్సీ–2, ఎస్టీ–2, తొమ్మిదో తరగతిలో బీసీఏ–1, బీసీబీ–1, బీసీసీ–1 బీసీఈ–1, ఎస్టీ–1 ఖాళీలున్నాయని చెప్పారు. వీటి ప్రవేశ పరీక్ష ఈ నెల 20న జరుగుతుందని, అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 15లోపు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో సమర్పించాలని పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైటీఎస్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు.


సమనస గురుకుల పాఠశాల